గోమాతకు ఇంటింటా పూజ

- ఉదయం 6 గంటలకే ఇంటింటికీ వెళ్తున్న ఆవు
- పూజ చేసే దాకా కదలని వైనం
- రొద్దకాంబదేవే అంటున్న గ్రామస్తులు



ఓ ఇంటి వద్ద పూజ కోసం వేచి ఉన్న గోవు



రొద్దంలో ఓ ఇంటి వద్ద చిన్నారితో పూజలందుకుంటున్న గోమాత

రొద్దం: హిందువులు గోవులకు పూజ చేయడం అందరికీ తెలిసిందే. అయితే రొద్దం మండల కేంద్రంలోని ఓ ఆవు ప్రతిరోజూ ఇంటింటా పూజలు అందుకుంటోంది. రోజూ ఉదయం 6 గంటలకే ఆ గోవు ఒక్కో ఇంటి వద్దకు వచ్చి నిల్చుంటుంది. ఆ ఇంటి మహిళ పసుపు, కుంకుమతో పూజ చేస్తేకానీ మరో ఇంటి వద్దకు వెళ్లదు. అలా ఇంటింటికీ వెళ్లి ఆ గోమాత పూజలందుకుంటోంది. మహిళలు, పురుషులు, చిన్న, పెద్ద తేడా లేకుండా ఆవుకు మొక్కుకుంటారు. సాక్ష్యాత్తూ తమ గ్రామ దేవత రొద్దకాంబదేవిగానే మహిళలు కొలుస్తున్నారు. కొన్నేళ్లుగా రోజూ ఉదయం గోమాత గ్రామంలోని ప్రతి ఇంటి వద్దకు వస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఉదయం 10 గంటల వరకే గోమాత ఇంటింటికీ వెళ్తుంది. ఆ తర్వాత ఊర్లో ఉన్న రొద్దకాంబదేవి ఆలయం వద్దకు వెళ్లిపోతుంది. దాదాపుగా 70 నుంచి 100 ఇళ్ల వరకు రోజూ సందర్శిస్తుందని ప్రజలు చెబుతున్నారు. పాతర్లపల్లికి చెందిన సిద్దయ్య అనే వ్యక్తి ఈ ఆవును 15 ఏళ్ల క్రితం రొద్దకాంబదేవికి మొక్కుబడికి వదిలారని అంటున్నారు. రోజూ గోమాతకు పూజలు చేస్తే అంతా మంచి జరుగుతుందన్న నమ్మకంతో గోమాతను కొలుస్తున్నట్లు పేర్కొన్నారు.

మా గ్రామ దేవతే ఇలా..



గ్రామ దేవత రొద్దకాంబవిగా భావిస్తూ ప్రతిరోజూ ఉదయం మా ఇంటి ముందుకు వచ్చే గోమాతను పూజిస్తున్నాం. రొద్దకాంబదేవి ఆవు రూపంలో గ్రామంలో తిరుగుతోందని మా నమ్మకం. ఇంటి వద్ద రాగానే ఆవుకు పసుపు, కుంకం, పూలతో పూజలు చేస్తాం. అనంతరం మరో ఇంటి వద్దకు వెళుతుంది. ఇలా ప్రతి ఇంటికీ వెళ్లి పూజలు అందుకుంటోంది. **- రొద్దక్క , రొద్దం**

రోజూ పూజ చేస్తాం



15 సంవత్సరాలుగా ఆవును రొద్దకాంబ దేవతలా భావిస్తూనే కొలుస్తున్నాం. ఉదయం 6 గంటలకే ఇళ్ల వద్దకు వచ్చిన గోమాత నిలబడుతుంది. పూజ చేసేన తర్వాతనే మరో ఇంటికి వెళ్తుంది. ఉదయం 10 గంటల వరకు మాత్రం ఇళ్ల వద్దకు వస్తుంది. ఆ తర్వాత మళ్లీ రొద్దకాంబదేవి గుడి వద్దకు వెళ్లిపోతుంది. రోజూ ఆవుకు పూజ చేస్తే అంతా మంచే జరుగుతుంది. **- కోమలి, రొద్దం**

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

మడకశిర: పట్టణంలోని రాజీవ్‌గాంధీ సర్కిల్‌లో సోమవారం ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీటీ కళా జాత బృందం సభ్యులు బాల్య వివాహాల ద్వారా కలిగే అనర్థాలను నాటిక రూపంలో కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఆర్డీటీ సంస్థ సాంస్కృతిక శాఖ ఎస్‌టీఎల్ శ్యాంసన్ పరంజ్యోతి, సిబ్బంది నాగరాజు, రమణ పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వారిపై చర్య తీసుకోవాలి

పరిగి: మండలంలోని ఏపీఆర్‌జేసీలో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందిపై కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని కుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే సోమవారం పరిగిలో మండల కార్యాలయంలో తహసీల్దార్ సౌజన్యలక్ష్మిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. కులం పేరుతో దూషణకు సంబంధించి కళాశాలలో ప్రాథమిక విచారణ చేపట్టినప్పటికీ బాధ్యులపై ఇప్పటి దాకా చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే కులంపేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా దళిత సమాఖ్య అధ్యక్షుడు నారాయణ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రమణ, ఎంఎస్ఎఫ్ రవికుమార్, ఎమ్మార్పీఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెనుకొండ: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివశంకరప్ప తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



గుడ్ల నాణ్యత పరిశీలిస్తున్న ఎంపీపీ ప్రమీల

గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రం గ్రామంలోని అంగనివాడీ కేంద్రాలను సోమవారం ఎంపీపీ ప్రమీల ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పిల్లల హాజరు రిజిస్టర్‌తో పాటు పౌష్టికాహార నిలువలు, కోడి గుడ్ల నాణ్యత పరిశీలించారు.

నేడు మున్సిపల్ సమావేశం

పెనుకొండ: నగర పంచాయతీ అత్యవసర సమావేశాన్ని మంగళవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ ఉమర్‌ఫారూక్ నేతృత్వంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ తెలిపారు. కౌన్సిలర్లు తప్పక సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు.

పింఛన్ నిధుల మంజూరు

మడకశిరరరూరల్: సామాజిక పింఛన్ల పంపిణీకి సంబంధించి మార్చికి సంబంధించిన పింఛన్ నిధులు మంజూరైనట్లు మండల పరిషత్ ఏఓ నరసింహమూర్తి తెలిపారు. మడకశిర రూరల్‌లో 8,903 మంది లబ్ధిదారులకు రూ.2,47 కోట్లు , మడకశిర నగర పంచాయతీలో 2,258 రూ.62.66 లక్షలు , అగళి మండలంలో 5,317 మందికి రూ.1.45 కోట్లు, రొళ్లలో 5,612 మందికి రూ.1.55 కోట్లు, గుడిబండలో 8,237 మందికి రూ.2.25 కోట్లు, అమరాపురంలో 8,523 మందికి రూ.2.36 చొప్పున పింఛన్ నగదు మంజూరైందన్నారు.

చికిత్స కోసం వచ్చి తిరిగిరాని లోకాలకు..

మడకశిర(అగళి): వైద్య చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం అగళిలో చోటు చేసుకొంది. మండలంలోని వడగుంటనహళ్లికి చెందిన లక్ష్మణ్ (40) కొద్దిరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో వైద్య చికిత్స కోసం అగళిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చి ఆకస్మికంగా మృతి చెందాడు. బీపీ పూర్తిస్థాయిలో పడిపోవడంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సామాజిక తనిఖీపై అవగాహన

రొద్దం: మండల వ్యాప్తంగా జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు నిర్వహిస్తామని ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ చెప్పారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు భవనంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు సామాజిక తనిఖీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఓ జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఊరేగింపు

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాన్ని సోమవారం గుడిబండ మండలం సీసీ గిరి గ్రామానికి తరలించారు. ఆలయం నుంచి భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా స్వగ్రామానికి భక్తులు తీసుకువెళ్లారు. మంగళవారం సీసీ గిరి గ్రామంలో అమ్మవారికి జ్యోతుల ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు జ్ఞానేంద్రబాబు తెలిపారు. భక్తులు ఉత్సవానికి అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

సమగ్ర భూసర్వే పూర్తి చేయండి

అమరాపురం: మండలంలో సమగ్ర భూ సర్వేను పూర్తి చేయాలని తహసీల్దార్ సురేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సచివాలయం వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో రైతుల భూములను సమగ్రంగా పక్కగా సర్వే చేయాలని సూచించారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. దీంతో ప్రతి కోడ్‌ను అమలు చేయాలన్నారు. సచివాలయాల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి వాటిని పరిష్కరించాలన్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరా వేళల మార్పు

లేపాక్షి: లేపాక్షి సబ్‌స్టేషన్ 33/11 కేవీ పరిధిలోని కొండూరు, కుర్లపల్లి, కంచిసముద్రం, నాయనిపల్లి ఫీడర్లుకు సంబంధించి వ్యవసాయ విద్యుత్ సరఫరాను మంగళవారం నుంచి మార్పు చేసినట్లు ఏఈ వెంకటేశులు తెలిపారు. ఏ–గ్రూపులో 00:00 నుంచి 04:00, 08:00 నుంచి 13:00, బి–గ్రూపులో 04: 00 నుంచి 08:00, 13:00 నుంచి 18:00 వరకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

అనుమతి పొందాకే విగ్రహాలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ కార్తీక్

పెనుకొండ: అనుమతులు పొందాకే విగ్రహాలు ఏర్పాటు చేయాలని సబ్‌కలెక్టర్ కార్తీక్ పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం విగ్రహాల ఏర్పాటు విషయంపై డివిజన్‌స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ జీఓ ఎంఎస్ నంబర్ 18 గురించి చర్చించారు. కొత్త విగ్రహాల ఏర్పాటుకు అనుమతించడం జరగదని, రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాల ఏర్పాటు నిషేధించినట్లు తెలిపారు. స్టాచ్యూ కమిటీ నుంచి అనుమతి పొందాకే విగ్రహాల ఏర్పాటు చేపట్టాలని, అనుమతి లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రోడ్లు భవనాలశాఖ ఈఈ సంజీవయ్య, పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, పోలీసులు పాల్గొన్నారు.

రేషన్ సకాలంలో అందించండి

పెనుకొండ: స్టోర్ డీలర్లకు సకాలంలో రేషన్ అందజేయాలని సబ్‌కలెక్టర్ కార్తీక్ పేర్కొన్నారు. పట్టణంలోని చౌకధాన్యపు గోదామును సోమవారం సాయంత్రం సబ్‌కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ సకాలంలో రేషన్ డీలర్లకు రేషన్ అందించాలన్నారు. తహసీల్దార్ స్వర్ణలత, పౌరసరఫరాలశాఖ అధికారిణి ప్రభావతమ్మ పాల్గొన్నారు.

రూ.3,578తో రాగుల కొనుగోలు



వీరజ్జనపల్లిలో రాగి పంటను పరిశీలిస్తున్న జిల్లా పౌరసరఫరాల మేనేజర్ అశ్వర్థ నారాయణ

గుడిబండ: మండల కేంద్రంలోని ఆర్బీకే కేంద్రంలో ప్రభుత్వం రైతుల వద్ద నుంచి రాగులు కొనుగోలు చేస్తుందని జిల్లా పౌరసరఫరాల మేనేజర్ అశ్వర్థ నారాయణ నాయక్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని వీరజ్జనపల్లి గ్రామంలో రైతులు సాగుచేసిన రాగి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస మద్దతు ధర రూ.3,578తో ప్రభుత్వమే రాగులను కొనుగోలు చేస్తుందన్నారు. కొనుగోలు చేసిన రోజే రైతులకు నగదు చెక్కు అందజేస్తామన్నారు. మండలంలో రబీలో రాగి సాగు చేసిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంట నమోదు చేసుకున్న రైతుల వద్ద నుంచి మాత్రమే రాగులు కొనుగోలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ తిమ్మప్ప, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విజయకుమారి మృతిపై సంతాపం

మడకశిర: స్థానిక ఆర్టీసీ డిపోలో డీసీగా విధులు నిర్వహిస్తున్న విజయకుమారి మృతి పట్ల ఆర్టీసీ కార్మికులు సోమవారం సంతాపాన్ని తెలిపారు. విజయకుమారి అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఈ నేపథ్యంలో డిపో ఈయూ అధ్యక్షులు రఫీక్, కార్మికులు విజయకుమారి భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అలాగే ఆర్టీసీ అధికారులు, ఇతర కార్మిక సంఘాల నాయకులు సంతాపాన్ని తెలిపారు.

డివైడర్ వెడల్పు తగ్గించండి

పెనుకొండ: సోమందేపల్లి పట్టణ కేంద్రంలోని ఎన్‌టీఆర్ సర్కిల్లో రోడ్డు డివైడర్ ఎక్కువగా ఉండడం వల్ల ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, వెడల్పు తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి రాజ్‌గోపాల్ తెలిపారు. సోమవారం ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో డీఈ నాగరాజు వినతి పత్రం అందించారు. నాయకులు చాంద్‌బాషా, గంగరాజు, బాలస్వామి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో చోరీ

పెనుకొండ: పట్టణంలోని కృష్ణదేవరాయ రోడ్డులోని మోహన్ గురుస్వామి ఫ్యాన్సీ స్టోర్‌లో సోమవారం చోరీ జరిగింది. ఫోన్‌లో మాట్లాడినట్టు నటిస్తూ దొంగ స్టాను ఎత్తుకెళ్లాడు. ఈ వ్యవహారమంతా సీసీ కెమెరాల్లో రికార్డు అయింది.

కొనసాగుతున్న సంప్రోక్షణ కార్యక్రమం

రొద్దం: మండల పరిధిలోని ఎల్‌జీబీనగర్ సమీపంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో అంజనేయస్వామికి రెండో రోజు సోమవారం సంప్రోక్షణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంఘాలు బలోపేతం చేయండి

రొళ్ల: గ్రామాల్లో పొదుపు సంఘాలను బలోపేతం చేయడానికి గ్రామైక్య సంఘం లీడర్లు శ్రద్ధ తీసుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సువర్ణ పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వివిధ గ్రామాల గ్రామైక్యం సంఘం లీడర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

క్రీడాకారులకు అభినందన

లేపాక్షి: హిందూపురం పట్టణంలోని ఎస్‌డీజీఎస్ కళాశాల క్రీడా మైదానంలో యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ ప్రతినిధులు నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో 12 సంవత్సరాల్లోపు మిక్స్ జెండర్ పోటీల్లో పులమతి పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు క్రిష్ణమోహన్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ రామాంజినేయులతో పాటు ఉపాధ్యాయులు సోమవారం సాయంత్రం విద్యార్థులను అభినందించారు. అదేవిధంగా బెస్ట్‌ప్లేయర్ అవార్డు పొందిన తనుజసాయి, బెస్ట్ గోల్ కీపర్ అవార్డు పొందిన గురుసాయినాయక్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

చిన్నారికి వీల్ చైర్ అందజేత

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని మండల పరిషత్ పాఠశాల (ఉర్దు)లో రెండో తరగతి చదువుతున్న చిన్నారి మహమ్మద్ ఆర్ఫాన్‌కు ఎంఈఓ నాగరాజు చేతులు మీదుగా స్పెషల్‌వీల్ చైర్‌ను సోమవారం అందజేశారు.

పన్ను చెల్లింపునకు నేడు ఆఖరు

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీకి చెల్లించాల్సిన ట్రేడ్ లైసెన్సులు, ఇతర పన్నులు చెల్లించడానికి ఫిబ్రవరి 28 ఆఖరు తేదీ అని, అనంతరం 25 శాతం అపరాధ రుసుముతో చెల్లించాల్సి ఉంటుందని నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ తెలిపారు. వెంటనే మున్సిపల్ కార్యాలయం వద్దకు వచ్చి ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించి తగిన రసీదు పొందాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చిలమత్తూరు: మండలంలోని టేకులోడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జయచంద్రారెడ్డి శనివారం గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

రాయితీ పరికరాలకు దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర: అగళి మండలంలోని రైతులు ప్రభుత్వం రాయితీతో అందించే వ్యవసాయ పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ శేఖర్ నాయక్ ఓ ప్రకటన ద్వారా తెలిపారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా 50 శాతం రాయితీతో అర్హులైన రైతులు వ్యవసాయ పరికరాలను పొందవచ్చున్నారు.

విగ్రహ ప్రతిష్టాపనోత్సవం ప్రారంభం

మడకశిర(అగళి): మండల పరిధిలోని కోడిహళ్లిలో సోమవారం పట్టాభి రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఆత్మ విమర్శ చేసుకోవాలి

పావగడ: విమర్శలు చేసే ముందు ఆత్మ విమర్శ చేసుకొని మాట్లాడాలని ఎమ్మెల్యే వెంకటరమణప్ప కేఆర్పీపీ అధినేత గాలి జనార్ధన రెడ్డికి హితవు పలికారు. ఆదివారం జరిగిన బహిరంగ సభలో రాయప్ప (తిమ్మరాయప్ప), రమణప్ప (వెంకటరమణప్ప)లను ఇంటికి సాగనంపుతామన్న గాలి జనార్ధనరెడ్డి మాటలపై ఎమ్మెల్యే స్పందించారు. స్థానిక తుమకూరు రోడ్డులో ఉన్న అటవీ ప్రాంతంలో రూ. 30 లక్షల వ్యయంతో నిర్మించిన అటవీశాఖ కార్యాలయాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగు సార్లు జైలుకెళ్లొచ్చిన జనార్ధన రెడ్డి మరోసారి జైలుకెళ్లకుండా చూసుకోవాలన్నారు.

ఇద్దరికి గాయాలు

పెనుకొండ: పట్టణ సమీపంలోని ఆర్టీఓ చెక్‌పోస్టు సమీపంలో సోమవారం లారీ బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. తమిళనాడు నుంచి బట్టల లోడుతో బయలుదేరిన లారీ చెక్‌పోస్టు సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడిపోయింది. డ్రైవర్ గోవింద్, క్లీనర్ రాజుకు గాయాలయ్యాయి.

చౌళూరు రామకృష్ణారెడ్డికి ఘన నివాళి



కేక్ కట్‌చేస్తున్న చౌళూరు రామకృష్ణారెడ్డి తనయుడు తనుష్‌రెడ్డి

హిందూపురం: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మాజీ సమన్వయకర్త, దివంగత చౌళూరు రామకృష్ణారెడ్డి లేనిలోటు పూడ్చలేనిదని ఆయన సోదరి చౌళూరు మధుమతిరెడ్డి అన్నారు. సోమవారం రామకృష్ణారెడ్డి జయంతి సందర్భంగా చౌళూరులో రామకృష్ణారెడ్డి విగ్రహానికి ఆయన సతీమణి జ్యోత్స్నారెడ్డి, కుమారుడు తనుష్‌రెడ్డి, బావ నాగభూషణ్‌రెడ్డి గ్రామస్తులతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రామకృష్ణారెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రత్నమ్మ, సర్పంచ్ నంజప్ప, తిమ్మారెడ్డి, సూర్యనారాయణ, నాగరాజు, చౌడప్ప, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: కొడికొండ చెక్‌పోస్ట్ దగ్గరున్న సమర్థనం దివ్యాంగుల ట్రస్ట్‌లో రామకృష్ణారెడ్డి జయంతి వేడుకను వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతి రెడ్డి , నాగభూషణరెడ్డి దివ్యాంగులతో కలిసి కేక్ కట్ చేశారు. ఎంపీటీసీ ఆదినారాయణ, నాయకులు షాకీర్, హరి, నాగరాజు స్వామి, భాస్కర్‌రెడ్డి, చౌడప్ప, రవీంద్రరెడ్డి, సూర్యనారాయణ, వాల్మీకి సోము తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: స్థానిక జేపీసీ భవనంలో చౌళూరు రామకృష్ణారెడ్డి జయంతిని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం జరుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి దంపతులు రామకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అంజనరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, నాయకులు ఆదినారాయణరెడ్డి, చరణ్, వెంకటరెడ్డి, గణేష్, అశ్వర్థప్ప, శ్యాం, ఆనందరెడ్డి, అజయ్, నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రరెడ్డిని గెలిపించండి



ప్రాధాన్యత ఓటు వేయాలని పట్టభద్రులకు వివరిస్తూ కరపత్రాన్ని అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిరరూరల్: వచ్చే నెలలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ తరుపున బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రరెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజర్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. సోమవారం మెళవాయి గ్రామంలో సర్పంచ్ రంగనాథ్, ఎంపీటీసీ గంగరత్నమ్మ, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఓటు హక్కు వినియోగంపై పట్టభద్రులకు అవగాహన కల్పించారు.

చిలమత్తూరులో...

చిలమత్తూరు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డిని గెలిపించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి మండలంలోని పలు గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

హిందూపురం: పట్టణ సమీపంలోని కిరికెరలోని ఎల్‌ఆర్‌జీ విద్యాలయంలో సోమవారం నిర్వహించిన మొదటి జోన్ లెవల్ కరాటే కటాస్ చాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనపర్చినట్లు మార్షల్ ఆర్ట్స్ అండ్ నేచర్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు రఫీక్ అహ్మద్ తెలిపారు. విజేతలకు స్కూల్ హెచ్ఎం ప్రసాద్, వ్యాయమ ఉపాధ్యాయులు అభినందిస్తూ సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు.

మల్బరీ పెంపకాన్ని ప్రోత్సహించాలి

మడకశిరరూరల్: నియోజకవర్గంలో వ్యవసాయ బోరు బావుల్లో నీటి మట్టం పెరిగిందని రైతులు మల్బరీ తోటల పెంపకాన్ని మరింతగా ప్రోత్సహించాలని ఉమ్మడి అనంతపురం జిల్లా పట్టుపరిశ్రమశాఖ జాయింట్ డైరెక్టర్ పద్మమ్మ సూచించారు. ఆమె సోమవారం బుళ్లసముద్రం, రంగాపురం గ్రామాల్లో పర్యటించి మల్బరీ షెడ్లు, ఫారంపాండ్లు, డ్రిప్ ద్వారా సాగు చేసిన మల్బరీ తోటలను తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం టౌన్: పట్టణంలోని ఆల్ అమిన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతో పాటు ఎంఈఓ గంగప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా ప్రారంభించారు. ఆలోచన తీరు, సృజనాత్మకత పెంపొందించుకోవాలని చైర్‌పర్సన్ ఇంద్రజ విద్యార్థులకు సూచించారు.

అమరాపురం: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ద్వారా వెలికి తీయవచ్చని జేకే పాఠశాల అధ్యక్షుడు ఖలీల్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది.



సందడిగా ఉట్ల పరుష

గుడిబండ మండల పరిధిలోని హిరేతుర్పిలో వెలసిన ఆంజనేయస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉట్ల పరుష నిర్వహించారు. ఉట్లమాను ఎక్కడానికి గ్రామంలోని యువకులు పోటీపడ్డారు. అనంతరం ఆంజనేయస్వామిని ముత్యాల పల్లకీలో ఊరేగించారు.
- గుడిబండ: